సాక్షి
విశాఖపట్నం
బుధవారం ၊ 14 ၊ జూన్ ၊ 2023



పునీత ఆంథోని చర్చి పండగ

వందేళ్ల చరిత్ర గల పునీత ఆంథోని దేవాలయంలో మంగళవారం ఘనంగా చర్చి పండగ జరిగింది. 8లో



మూడు'ముళ్ల' నుంచి రక్షణ

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలనే సీఎం వైఎస్ జగన్ ఆశయాలకు అనుగుణంగా యంత్రాంగం అడుగులు వేస్తోంది. 10లో



పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న పనుల కారణంగా ఆయా తేదీల్లో పలు రైళ్లు రద్దు చేశారు. 10లో

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీలో 80 శాతంపైగా ఉత్తీర్ణత

ఆరిలోవ : ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు అదరగొట్టారు. 80 శాతం పైగా ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షలు గత నెల 24న ప్రారంభమై జూన్ 1 వరకు జరిగిన విషయం తెలిసిందే. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రథమ సంవత్సరం 49,105 మంది, ద్వితీయ సంవత్సరం 41,510 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షలు ముగిసిన సుమారు 10 రోజులకే పేపరు మూల్యాంకనం పూర్తయింది. అనంతరం వీటి ఫలితాలను రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి మంగళవారం విడుదల చేసింది. ఈ పరీక్షల ఫలితాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 80.26 శాతం (39,414 మంది) ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 80.67 శాతం(33,487 మంది) ఉత్తీర్ణత సాధించారు. దీంతో ఉమ్మడి విశాఖ జిల్లా రాష్ట్రంలో ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఐదో స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో తొమ్మిదో స్థానంలో నిలిచింది.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు



విశాఖ స్పోర్ట్స్ : డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి అర్హులైన చిన్నారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. నాలుగు, ఐదో తరగతిలో ప్రవేశానికి ఈ ఎంపికలు తొలుత మండల స్థాయిలో నిర్వహిస్తారు. ఆ తరువాత జిల్లాకు ఎంపిక చేస్తారు. ఇక్కడ ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయికి పంపనున్నారు. రాష్ట్ర స్థాయిలో నాలుగో తరగతిలో బాలబాలికలను 20 మంది చొప్పున తీసుకోనుండగా.. ఐదో తరగతిలో బాలురకు ఏడు, బాలికలకు నాలుగు ఖాళీలున్నాయి. నాలుగో తరగతిలో ప్రవేశానికి 8-9 ఏళ్ల మధ్య, ఐదో తరగతిలో ప్రవేశానికి 9-10 ఏళ్ల మధ్య బాల బాలికలు అర్హులు. మండల స్థాయిలో ఎంపికలు ఈనెల 15 నుంచి 20 వరకు ఆయా మండల కేంద్రాల్లోను, జిల్లా స్థాయిలో ఈనెల 22వ తేదీన విశాఖలోని పోలీస్ బారెక్స్ గ్రౌండ్‌లోనూ జరగనున్నాయని వీడీఎస్ఏ సీఈఓ సుబ్బిరెడ్డి తెలిపారు. స్టడీ సర్టిఫికెట్, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఎంపిక పోటీల సందర్భంగా చూపించాల్సి ఉంటుందన్నారు. మండల స్థాయి ఎంపికల్లో పాల్గొనలేకపోయిన చిన్నారులు సైతం నేరుగా జిల్లా స్థాయి ఎంపికలకు హాజరుకావచ్చన్నారు.

ఏసీఏ గేమ్ డెవలపర్‌గా కుమార్



నియామకపత్రాన్ని అందిస్తున్న గోపీనాథ్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ) గేమ్ డెవలపర్ జీఎంగా ఎంఎస్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథరెడ్డి మంగళవారం ఆయనకు నియామకపత్రాన్ని అందించారు. పూర్వ రంజీ ఆటగాడైన కుమార్ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో చక్కటి సేవలందించి ఇటీవలే జీఎం స్పోర్ట్స్‌గా పదవీ విరమణ చేశారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కుమార్‌ను అభినందించింది.

కొనసాగుతున్న ఓరియంటేషన్ తరగతులు



గైస్‌లో విద్యార్థులకు వెబ్ ఆప్షన్లపై అవగాహన కల్పిస్తున్న జయప్రకాష్‌రెడ్డి

మురళీనగర్: పాలిసెట్ కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో నిర్వహిస్తున్న ఓరియంటేషన్ తరగతులు మంగళవారం కొనసాగాయి. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ (గైస్)లో స్థానిక ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ తరగతులకు రెండో రోజు 80 మంది విద్యార్థులు హాజరయ్యారు. సిస్టమ్ అడ్మిన్ సిహెచ్.జయప్రకాష్‌రెడ్డి విద్యార్థులకు వెబ్ ఆప్షన్లపై అవగాహన కల్పించారు. పాలిటెక్నిక్ కోర్సుల వివరాలు వాటి ప్రాధాన్యతను వివరించారు.

51 దుకాణాలకు రూ.1.05 లక్షల జరిమానా

దాబాగార్డెన్స్: నిషేధిత ప్లాస్టిక్ కలిగి ఉన్న దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల దాడులు కొనసాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన దాడుల్లో 51 దుకాణాల నుంచి రూ.1.05 లక్షల అపరాధ రుసుం వసూలు చేసినట్లు అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు తెలిపారు. ఈ దుకాణాల నుంచి 91.3 కిలోల ప్లాస్టిక్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వేటకు చలో చలో..

- ముగిసిన 61 రోజుల విరామం
- నేటి అర్ధరాత్రి నుంచి చేపల వేట
- గంగపుత్రులను ఆదుకున్న వైఎస్సార్ మత్స్యకార భరోసా



ఐస్‌ను బోటులోకి నింపుతున్న మత్స్యకారులు

61 రోజుల పాటు వేటకు సెలవిచ్చారు.. సముద్రం ఒడ్డున పడవలకు లంగరేశారు.. వలలను కుట్టుకొని, బోట్లకు మరమ్మతులు చేసుకుంటూ మత్స్యకారులు కాలక్షేపం చేశారు. వేట విరామం ముగియడంతో రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ వేటకు సిద్ధమయ్యారు. గత ప్రభుత్వాల హయాంలో భృతి సకాలంలో అందక కాలే కడుపులతో అవస్థలు పడేవారు. ఇప్పుడు వైఎస్ జగన్ సర్కారు వేట నిషేధ కాలంలోనే మత్స్యకార భరోసా సొమ్ము అందించడంతో పిల్లా పాపలతో కులాసాగా గడిపారు. నిషేధ కాలం ముగియడంతో నేటి అర్ధ రాత్రి నుంచీ మళ్లీ చేపల వేట ప్రారంభం కానుంది. ఇన్నాళ్లూ బోసిపోయిన ఫిషింగ్ హార్బర్ కళకళలాడనుంది.

మహారాణిపేట: సముద్ర గర్భంలో చేపలు గుడ్లు పెట్టే కాలంలో వాటిని ఎదగనిచ్చేందుకు వేటకు విరామం ఇస్తారు. 61 రోజులపాటు చేపలు పట్టకుండా మత్స్యకారులు నిగ్రహం పాటిస్తారు. ఏప్రిల్ 14వ తేదీ అర్ధరాత్రి మొదలైన నిషేధ కాలం బుధవారం అర్ధరాత్రితో ముగుస్తుంది. అర్ధరాత్రి దాటిన తర్వాత వేటకు వెళ్లేందుకు మత్స్యకారులు అంతా సిద్ధం చేసుకున్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల మత్స్యకార మహిళలు గంగమ్మకు పూజలు చేశారు. వేటకు వెళ్లే తమ పెనిమిటి, పిల్లలు క్షేమంగా తిరిగి రావాలని, మత్స్య సంపద పుష్కలంగా లభించి తమ బతుకు పండాలని వేడుకున్నారు. విశాఖ జిల్లా పరిధిలో తీరాన్ని ఆనుకొని సుమారు 15 మత్స్యకార గ్రామాలున్నాయి. ఒక్క ఫిషింగ్ హార్బర్‌పైనే 12 వేల కుటుంబాలు కేవలం చేపల వేట, విక్రయంపైనే ఆధారపడి బతుకుతున్నాయి. జిల్లా మొత్తం 28 వేల కుటుంబాలు సముద్రాన్నే నమ్ముకున్నాయి. జిల్లాలో మర పడవలు 686, మోటార్ బోట్లు 1208, తెప్పలు 350 వరకు ఉన్నాయి.

సకాలంలో మత్స్యకార భరోసా

వేట నిషేధ సమయంలో అందించే మత్స్యకార భృతి విషయంలో గత ప్రభుత్వాలు శ్రద్ధ చూపేవి కావు. ముఖ్యంగా టీడీపీ ప్రభుత్వ హయాంలో వేట నిషేధం ముగిసి నెలలు గడిచినా భృతి అందేది కాదు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కచ్చితంగా విరామ సమయంలోనే మత్స్యకార భరోసా సాయాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో ఎలాంటి కష్టం లేకుండా కాలం గడచిపోతోంది. ఈ ఏడాది 11,334 మంది మత్స్యకారులకు రూ.10 వేలు చొప్పున 11,33,40,000 భృతి అందింది.

> **మత్స్యకారులకు ప్రభుత్వం అండ**
>
> రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంది. ఈ ఏడాది జిల్లాలో11,334 మందికి భృతిని వేట నిషేధ సమయంలోనే వారి ఖాతాల్లోకి జమ చేసింది. వేట సమయంలో ప్రకృతి వైపరీత్యాల పట్ల మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి.
>
> – విజయ, జాయింట్ డైరెక్టర్, మత్స్యశాఖ

• చల్లంగా చూడు గంగమ్మ తల్లి



గంగమ్మ తల్లి



పూజలు చేస్తున్న మత్స్యకారులు

ఫిషింగ్ హార్బర్‌లో మంగళవారం గంగమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. చేపల వేట తిరిగి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మత్స్యకార మహిళలు పెద్ద సంఖ్యలో హార్బర్‌కు చేరుకుని.. గంగమ్మ తల్లి ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా పసుపు, కుంకుమతో పూజలు చేపట్టారు. చేపల వేట బాగుండాలని, వేటకు వెళ్లే మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావాలని తల్లికి మొక్కుకున్నారు. అనంతరం సముద్రంలో పసుపు, కుంకుమ వేసి పూజలు చేశారు. కాగా.. 61 రోజుల విరామం అనంతరం బుధవారం అర్ధరాత్రి నుంచి వేట ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. మరపడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ ఆధ్వర్యంలో ఆలయం వద్ద ఏర్పాట్లు చేశారు. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. – మహారాణిపేట



పూజలు చేస్తున్న మహిళలు

3,520 మందికి స్థానచలనం

- బదిలీలతో ఉపాధ్యాయుల్లో జోష్
- వెబ్ కౌన్సెలింగ్‌పై సర్వత్రా హర్షం
- ఇంట్లో కూర్చొని బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు
- ఎటువంటి పైరవీలు లేకుండానే కోరుకున్న చోటుకు బదిలీ
- ఉమ్మడి విశాఖ జిల్లాలో పూర్తయిన బదిలీలు



విశాఖ విద్య: ఉపాధ్యాయుల బదిలీలు అంటే అదో ప్రహసనంగా ఉండేది. ఆందోళనలు, ధర్నాలతో విద్యాశాఖాధికారుల తలలకు బొప్పి కట్టేది. ఇది ఒకప్పటి మాట.. నేడా పరిస్థితి లేదు. ఎటువంటి పైరవీలు లేకుండానే ఎంచక్కా ఇంట్లో కూర్చొని కోరుకున్న చోటుకు బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయుల్లో సరి కొత్త జోష్ కనిపిస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో బదిలీల ప్రక్రియ పూర్తయింది. బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు పాత ప్రదేశాల నుంచి రిలీవై కొత్త ప్రదేశాల్లో చేరారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని క్యాడర్లు కలుపుకొని 3,520 మంది ఉపాధ్యాయులకు బదిలీ జరిగినట్లు డీఈఓ కార్యాలయ అధికారులు వెల్లడించారు. ఇందులో గ్రేడ్ -2హెచ్ఎం-150, స్కూల్ అసిస్టెంట్ గణితం- 336, స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్ - 170, స్కూల్ అసిస్టెంట్ బయాలజీ- 203, స్కూల్ అసిస్టెంట్ సోషల్ -255, స్కూల్ అసిస్టెంట్ తెలుగు- 172, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ -380, హిందీ -93, ఫిజికల్ డైరెక్టర్- 73 మంది ఉపాధ్యాయులకు బదిలీ జరిగింది. అదేవిధంగా సెకండరీ గ్రేడ్ టీచర్లు 1,688 మందికి బదిలీ అయింది. వెబ్ కౌన్సె లింగ్ పద్ధతిన బదిలీల ప్రక్రియ జరగడంతో ఉపాధ్యాయులు తమ ఇంట్లో కూర్చుని బదిలీ ఉత్తర్వులు అందుకున్నారు. ఎటువంటి పైరవీలు లేకుండా కోరుకున్న చోటకు బదిలీ జరుగడంతో ఉపాధ్యాయుల్లో సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది. 8 ఏళ్ల సర్వీసు పైబడిన ఉపాధ్యాయులు ఎక్కువగా ఉండటంతో బదిలీ ఉత్తర్వుల జారీలో జిల్లాలో కాస్త ఆలస్యమైంది. బదిలీ కోరుకునే ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్ల సమయంలో చేసిన తప్పిదాల కారణంగా, అదేవిధంగా డీఈఓ కార్యాలయం సిబ్బంది సకాలంలో ఖాళీలను చూపించకపోవడం వంటి కారణాలతో జిల్లాలో ఎస్జీటీ క్యాడర్లకు సంబంధించిన ఉత్తర్వులు జారీ కావడంలో ఆలస్యమైంది. ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖ డీఈవో చంద్రకళ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేయడం ద్వారా బదిలీల ప్రక్రియ సజావుగా ముగిసింది. వెబ్ ఆప్షన్‌లో చోటు చేసుకున్న తప్పిదాల కారణంగా బదిలీ ఉత్తర్వులు అందుకోలేని ఉపాధ్యాయులకు సైతం మేలు చేసేలా విద్యాశాఖ ఉన్నతాధికా రులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇలాంటివారు డీఈఓ కార్యాలయంలో సంప్రదిస్తే అందుబాటులో ఉన్న ఖాళీలు మేరకు వారికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చేలా పరిశీలిస్తున్నారు.

కడుపుబ్బా నవ్వించే 'నారాయణ అండ్ కో'

- 30న థియేటర్లలో విడుదల
- నగరంలో సందడి చేసిన చిత్ర యూనిట్



వివరాలు వెల్లడిస్తున్న చిత్ర హీరో, నిర్మాత సుధాకర్

అల్లిపురం : నారాయణ అండ్ కో చిత్రం ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుందని హీరో విశాఖ వాసి సుధాకర్ అన్నారు. తన రెండో చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో సుధాకర్ విలేకరులతో మాట్లాడుతూ ఈ చిత్రానికి తాను సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది తనకు మంచి బ్రేక్ ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చిత్రంలో తనతో పాటు సీనియర్ నటులు ఆలీరాజా, సప్తగిరి వంటి కమెడియన్‌లు నటిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబంతో చూడదగ్గ వినోదాత్మక చిత్రమని తెలిపారు. నటి ఆమని మాట్లాడుతూ తన తొలి సినిమా జంబలకడి పంబ తర్వాత అంతటి హాస్య భరితమైన చిత్రం నారాయణ అండ్ కో అని అన్నారు. ఇప్పటివరకు తన కెరీర్‌లో చేయని అద్భుతమైన పాత్ర ఈ చిత్రంలో పోషించానన్నారు. చిత్ర దర్శకుడు పాపిశెట్టి చిన్న మాట్లాడుతూ సినిమాను ఎంతో వినోదాత్మకంగా రూపొందించామన్నారు. ఎటువంటి క్రైం సంబంధం లేని ఒక కుటుంబం అనుకోని సంఘటనలో క్రైం చేయాల్సిరావడం.. ఆ తరువాత జరిగే పరిణామాలు హాస్య భరితంగా ఉంటాయన్నారు. ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు హీరో సుధాకర్‌తో కలసి సహ నిర్మాతగా వ్యవహరించినట్లు తెలిపారు. దాన వీర సూర కర్ణ చిత్ర సెట్‌లో తీసిన దర్బార్ పాటకు మంచి రెస్పాన్స్ వచ్చిందన్నారు. హీరోయిన్ పూజా కిరణ్, యామిని (విశాఖ) మాట్లాడుతూ నారాయణ అండ్ కో చిత్రాన్ని ఆదరించాలని కోరారు. సమావేశంలో యువ నటుడు జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ పండగ



పూజలు అందుకున్న పైడితల్లి అమ్మవారు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు కొత్తవీధిలోని ఆలయానికి భక్తులు పోటెత్తారు. పసుపు కుంకుమలు, చీరలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి దేవస్థానం తరపున డిప్యూటీ ఈవో సుజాత నూతన వస్త్రాలు సమర్పించారు. గాంధీనగర్‌లో శతకంపట్టు వద్ద ఉన్న పైడితల్లి అమ్మవారి ఘటాల గుడి వద్ద కూడా గ్రామస్తులు తరలివచ్చి పూజలు చేశారు. సింహాచలం దేవస్థానం అధికారులు భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మంగళవారం రాత్రి అమ్మవారి అనుపు మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

వరుణాస్త్ర

మేడ్ ఇన్ వైజాగ్

- నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీలో నిర్మాణం
- ఇటీవల ఈ టార్పెడో ప్రయోగం విజయవంతం
- యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, యుద్ధ విమానాల నుంచి ప్రయోగించేలా రూపకల్పన
- 50 కి.మీ దూరంలోని టార్గెట్‌ను మట్టుపెట్ట గల సామర్థ్యం



సాక్షి, విశాఖపట్నం: భారత నౌకాదళానికి అత్యంత శక్తివంతమైన వరుణాస్త్రను అందించిన ఘనతను విశాఖ సొంతం చేసుకుంది. ఇండియన్ నేవీ యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ సామర్థ్యాలను మెరుగుపరచడానికి వరుణాస్త్ర టార్పెడోను భారత రక్షణ పరిశోధన సంస్థ(డీఆర్‌డీవో), భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సహకారంతో ఎన్ఎస్‌టీఎల్ తయారు చేసింది. మూడేళ్ల కిందటే ఈ హెవీ వెయిట్ టార్పెడో (వరుణాస్త్ర) నిర్మాణాన్ని పూర్తి చేసిన ఎన్ఎస్‌టీఎల్.. 2020 నవంబర్‌లో భారత నౌకాదళానికి అప్పగించింది. ఇప్పటికే యుద్ధ నౌక, యుద్ధ విమానం నుంచి విజయవంతంగా వరుణాస్త్ర ప్రయోగాన్ని నిర్వహించిన భారత నౌకాదళం తాజాగా సబ్‌మెరైన్ నుంచి ప్రయోగించి విజయవంతంగా 40 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాన్ని ఛేదించింది.

వరుణాస్త్ర.. గొప్ప వరం

ఎన్ఏడీ జంక్షన్ సమీపంలోని ఎన్ఎస్‌టీఎల్‌లో వరుణాస్త్ర తయారైంది. అనేక ట్రయల్స్ తర్వాత వరుణాస్త్ర హెవీ వెయిట్ టార్పెడో.. అన్ని యుద్ధనౌకలు, జలాంతర్గాముల నుంచి ప్రయోగించేలా రూపుదిద్దుకుంది. ఈ వరుణాస్త్ర సామర్థ్య లక్షణాలను అంచనా వేసేందుకు డీఆర్‌డీవో ఆధ్వర్యంలో 130 సాంకేతిక ట్రయల్స్, యూజర్ ట్రయల్స్ నిర్వహించారు. వరుణాస్త్ర హెవీ వెయిట్ టార్పెడో యాంటీ సబ్‌మెరైన్, యాంటీ షిప్ ఆపరేషన్లలో విద్యుత్‌తో నడిచేలా రూపొందించారు. ఇది గరిష్టంగా సాగర గర్భంలో 600 మీటర్ల లోతులో గంటకు 70 కిలోమీటర్ల వేగంతో.. 50 కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణించగలదు. అత్యంత అధునాతన ఆయుధమైన వరుణాస్త్ర భారత్‌కు గొప్ప వరంగా మారింది.

టార్గెట్ మిస్ అవ్వదు

వరుణాస్త్ర సముద్ర గర్భంలో అర కిలోమీటర్ లోతులో ఉన్నప్పటికీ నావిగేషన్ సిస్టమ్‌కు సంకేతాలను అందించగలదు. నీటి అడుగున ఎలాంటి ప్రతికూల వాతావరణంలోనైనా శత్రుదేశాల జలాంతర్గాములను ట్రాక్ చేసి మట్టుపెట్టగలదు. వరుణాస్త్రలో ఉన్న వార్‌హెడ్ పేలిపోయే అవకాశాలు చాలా తక్కువ. దీన్ని ఆపరేట్ చేయడం, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించడం చాలా సులభంతో పాటు సురక్షితం. అతి తక్కువ ఖర్చుతో తయారు చేసిన ఈ హెవీవెయిట్ టార్పెడో నేవీ యుద్ధ కార్యాచరణ అవసరాలను తీర్చగలదు. స్వదేశీ పరిజ్ఞానంతోనూ హెవీ వెయిట్ టార్పెడోలు తయారు చేయగల సత్తా భారత్ సాధించిందన్న సంకేతాలను వరుణాస్త్ర ద్వారా ప్రపంచ దేశాలకు చాటి చెప్పారు.

టార్పెడో విశేషాలివీ..

ఈ హెవీ వెయిట్ టార్పెడో వరుణాస్త్రను సముద్రంలో దాగి ఉన్న శత్రు దేశపు జలాంతర్గామిపై ప్రయోగించవచ్చు. 95 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారైంది. ప్రపంచంలో జీపీఎస్ ఆధారంగా దూసుకుపోయే ఏకైక టార్పెడోగా వారుణాస్త్ర వినుతి కెక్కింది. దీని విశిష్టతలను ఓసారి పరిశీలిస్తే..

వరుణాస్త్ర బరువు	1500 కిలోలు
పొడవు	7 నుంచి 8 మీటర్లు
వ్యాసం	533 మిల్లీ మీటర్లు
వార్‌హెడ్ బరువు	250 కిలోలు
ఆపరేషన్ పరిధి	50 కి.మీ
ఎంత లోతులోని సబ్‌మెరైన్‌ను ధ్వంసం చేయగలదు	600 మీటర్లు
నీటిలో ఎంత వేగంతో దూసుకెళ్తుంది	గంటకు 70 కిలో మీటర్లు



ఇగ్నో ప్రవేశాలకు 30 చివరి తేదీ

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం(ఇగ్నో) 2023 జూలై ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఓ ప్రకటన విడుదల చేశారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు కల్పించనున్నారు. https://ignouadmission.samarth.edu.in/ ను సందర్శించి ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు జూన్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు ఎంవీపీకాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

నిరుద్యోగ యువతకు పలు కోర్సుల్లో శిక్షణ

మహారాణిపేట: నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్టు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి.ఎస్.ఎస్.రవికుమార్ తెలిపారు. అసోసియేట్ ఎలక్ట్రిషియన్, అసిస్టెంటు జనరల్, వాటర్ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద ఉచిత శిక్షణ కోసం నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. మహారాణిపేటలో నేక్ శిక్షణ కేంద్రంలో అందించే శిక్షణ పూర్తిగా నాన్ రెసిడెన్షియల్ విధానంలో ఉంటుందన్నారు. శిక్షణానంతరం సంబంధిత రంగంలో ప్రైవేటు సెక్టార్లలో ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. వివరాలకు 8500502395, 7989572891 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

• ముందుకొచ్చిన సముద్రం



బీచ్‌రోడ్డు: వాతావరణ మార్పుల కారణంగా మంగళవారం సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఆర్.కె.బీచ్ వద్ద ఉవ్వెత్తున అలలు ఎగిసిపడి సందర్శకులను భయాందోళనకు గురిచేశాయి. చొచ్చుకొచ్చిన కెరటాలు ఇసుక తెన్నెలను దాటాయి. కోస్టల్ బ్యాక్టరీ నుంచి వైఎంసీఏ వరకు ఇదే పరిస్థితి కనిపించింది.



ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న అలలు

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగిపై హత్యాయత్నం

అక్కిరెడ్డిపాలెం: ఓ పండగలో ఇద్దరి వ్యక్తుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఒకరి చేతిలో ఉన్న కత్తి పక్కనున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగిపై కడుపులో గుచ్చుకోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక సింహగిరి కాలనీలో మంగళవారం అమ్మవారి పండగ జరిగింది. పండగలో ఆనంద్‌కుమార్, ఐస్‌క్రీమ్ విక్రయిస్తున్న గణేష్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అది తోపులాటకు దారితీసింది. ఆ సమయంలో గణేష్ చేతిలో కత్తి ఉన్న పక్కనే ఉన్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి బొడ్డేడ ఆనంద్ కుమార్ కడుపులో గుచ్చుకుంది. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స కోసం గాజువాకలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గాయాలపాలైన ఆనంద్‌కుమార్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆయన గాయానికి కారణమైన ఇరువురిని అదుపులోకి తీసుకొని గాజువాక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ కొల్లి సతీష్ హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మినీ జాబ్‌మేళాలో 73 మంది ఎంపిక


జాబ్‌మేళాలో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

కంచరపాలెం: ఊర్వశికూడలిలోని గౌరీ డిగ్రీ, పీజీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మంగళవారం నిర్వహించిన మినీ జాబ్‌మేళాకు అపూర్వ స్పందన లభించిందని సంస్థ అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. ప్రముఖ కంపెనీల సారథ్యంలో 110 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన ఇంటర్వ్యూకు 263 మంది అభ్యర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ కంపెనీకి 34 మంది అభ్యర్థులు, డాక్టర్ రెడ్డీస్ ఫార్మా కంపెనీకి 39 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు కళాశాల డి.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ఆదారి నందిని నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ రమేష్‌నాయుడు, సంస్థ ప్రతినిధులు లక్ష్మీదుర్గ, ప్రసాద్, ప్రీతి, రాము, సంస్థ సభ్యులు తెలిపారు.

ఘనంగా పునీత ఆంథోని చర్చి పండగ


సెయింట్ ఆంథోని చర్చి నుంచి జగదాంబ జంక్షన్ వైపు సాగుతున్న ప్రదక్షిణ ర్యాలీ


చర్చి నుంచి పునీత ఆంథోనిని ప్రదక్షిణకు బయటకు తీసుకొస్తున్న క్రైస్తవులు


ప్రదక్షిణలో పాల్గొన్న మహిళా భక్తులు


పునీత ఆంథోని

దాబాగార్డెన్స్: వందేళ్ల చరిత్ర గల పునీత ఆంథోని దేవాలయంలో మంగళవారం ఘనంగా చర్చి పండగ జరిగింది. గత నెల 31 నుంచి ఇక్కడ నవదిన ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు విశాఖ నుంచే గాక కోస్తాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అశేషంగా తరలివచ్చారు. పునీత ఆంథోని జీవిత విశేషాలను స్మరించుకున్నారు. హాజరైన గురువులు వివిధ అంశాలపై ప్రసంగించారు. సెయింట్ ఆంథోని పండగను పురస్కరించుకుని మంగళవారం విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాష్, గుంటూరు యూనివర్సల్ ఇంజినీరింగ్ కాలేజ్ ప్రతినిధి మాలపాటి ఫాతిమా మర్రెడ్డి ప్రత్యేక పూజలు జరిపారు. విచారణ గురువు ఫాదర్ డి.బాలశౌరి పర్యవేక్షణలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు తిరువీధి ప్రదక్షిణ, దివ్యపూజ బలితో ఈ వేడుకలు ముగిశాయి. తిరువీధి ప్రదక్షిణ చర్చి వద్ద ప్రారంభమై డిబ్బలపాలెం, జగదాంబ జంక్షన్, దండుబజార్, భుజంగరావుపేట, రామజోగిపేట, ఆంథోనినగర్, సెయింట్ ఆంథోని హైస్కూల్(గుడి చుట్టూ) మీదుగా పునీత ఆంథోని దేవాలయం వరకు సాగింది. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యుత్ షాక్‌తో కాంట్రాక్టు కార్మికుడు మృతి


రాజు మృతదేహం

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్ విభాగంలో వెల్డింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెదగంట్యాడ సిద్దేశ్వం ప్రాంతానికి చెందిన గొందేశి రాజు (30) సింటర్ ప్లాంట్ విభాగంలో కాంట్రాక్టు కార్మికునిగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం యథావిధిగా విధులు నిర్వహిస్తుండగా విద్యుత్ షాక్‌తో కింద పడిపోయాడు. వెంటనే సహోద్యోగులు సమీప కోక్‌ఓవెన్స్ ప్రాథమిక చికిత్సా కేంద్రానికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్టు ధ్రువీకరించారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెదుళ్లనరవలో భూ బాగోతం

- ప్రభుత్వ స్థలంలో 9 కమర్షియల్ షాపుల నిర్మాణం
- వేరే సర్వే నెంబర్‌తో విద్యుత్ కనెక్షన్లు
- మీటర్లు తొలగించడానికి వెళ్లిన విద్యుత్ శాఖ సిబ్బందిపై తిరుగుబాటు


కమర్షియల్ షాపులు

సాక్షి, విశాఖపట్నం : ప్రభుత్వ స్థలంలో దర్జాగా కమర్షియల్ షాపులు కట్టేశాడు. వేరే సర్వే నెంబర్ డాక్యుమెంట్ పెట్టి విద్యుత్ కనెక్షన్లు పొందాడు. ఒక్కో షాపు అద్దెకిచ్చి ప్రతి నెలా రూ.50 వేలు వరకు గడిస్తున్నాడు. వివరాల్లోకి వెళితే... సబ్బవరం మండలం వెదుళ్లనరవ గ్రామంలో సర్వే నెంబర్ 121లో 23.03 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. ఇందులో సుమారు 9.6 ఎకరాలు పేదలకు కేటాయించగా మిగిలిన స్థలం ఖాళీగా ఉంది. ఈ స్థలంపై అదే ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి కన్ను పడింది. ఇందులో 6 సెంట్లు ఆక్రమించి 9 కమర్షియల్ షాపులు నిర్మించాడు. విద్యుత్ కనెక్షన్ల కోసం 105 సర్వే నెంబర్ డాక్యుమెంట్‌తో దరఖాస్తు చేసుకున్నాడు. విద్యుత్ శాఖ అధికారులు కూడా అదే సర్వే నెంబర్ మీద కనెక్షన్లు మంజూరు చేసి మీటర్లు బిగించారు. వాస్తవానికి 105 సర్వే నెంబర్‌లో ఉన్న 5.7 ఎకరాల్లో కొంత ప్రభుత్వం, కొంత ప్రైవేటు స్థలం ఉంది. ఇందులో సదరు వ్యక్తి కొన్ని గజాల స్థలాన్ని గతంలో కొనుగోలు చేసి దానిని ఇతరులకు విక్రయించేశాడు. అదే డాక్యుమెంట్ పెట్టి 121 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మించిన షాపులకు విద్యుత్ మీటర్లు పొందాడు. ఆ షాపుల ద్వారా ప్రతి నెలా రూ.50 వేల వరకు అద్దె రూపంలో సంపాదిస్తున్నాడు. ఈ భూ ఆక్రమణలపై స్థానికులు కొంత మంది విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ స్థలంగా నిర్ధారణ

దీనిపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు సబ్బవరం తహసీల్దార్‌కు లేఖ రాశారు. ఆ షాపులు ప్రభుత్వ స్థలంలో నిర్మించారా? లేదా? అన్నది నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే తహసీల్దార్ సబ్బవరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్–1, సంబంధిత వీఆర్వోతో విచారణ చేపట్టారు. సర్వే నెంబర్ 121లో ఉన్న ప్రభుత్వ స్థలంలోనే ఆ షాపులు నిర్మించినట్లు తేల్చారు. ఇదే విషయాన్ని తహసీల్దార్ అధికారికంగా ఏపీఈపీడీసీఎల్ విజిలెన్స్ అధికారులకు లేఖ రాశారు. వెంటనే విద్యుత్ మీటర్లు తొలగించేందుకు విద్యుత్ సిబ్బంది వెళ్లగా కబ్జాదారుడు వారిని నిలువరించాడు. వారు పలుమార్లు కనెక్షన్లు తొలగించడానికి ప్రయత్నించినప్పటికీ వారిని అడ్డుకుంటున్నాడు.

రెవెన్యూ అధికారుల పాత్రపై ఆరోపణలు

ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారుల పాత్రపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. రహదారిపైనే 9 షాపులు నిర్మిస్తున్నా పట్టించుకోకపోవడం నుంచి.. ప్రభుత్వ స్థలంలోనే షాపులు నిర్మించారని నిర్ధారించినప్పటికీ వాటిని తొలగించకపోవడం వరకు పలు అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ అధికారులు, సిబ్బంది అండదండలతోనే ఈ నిర్మాణాలు సాగించాడన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ స్థలంలోనే ఇల్లు నిర్మాణం

సదరు వ్యక్తి భూ భాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వ స్థలాలనే కాకుండా ప్రైవేటు వ్యక్తులకు చెందిన స్థలాలకు నకిలీ ఎల్‌పీసీలు సృష్టించి కోర్టుల్లో కేసులు వేసి సెటిల్‌మెంట్ల పేరుతో డబ్బులు గుంజుతున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. అతడి ఇల్లు కూడా ప్రభుత్వ స్థలంలోనే నిర్మించినట్లు తెలుస్తోంది. 121 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి దానికి జిరాయితీ సర్వే నెంబర్ వేసి ఇల్లు నిర్మించినట్లు సమాచారం. అతనిపై దువ్వాడలో భూ కబ్జా కేసు, ఒక స్టీల్‌ప్లాంట్ ఉద్యోగికి చెందిన స్థలాన్ని కబ్జా చేసిన వ్యవహారంలోనే కాకుండా ఒక మహిళా న్యాయవాదితో ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడినందుకు గాను, మహిళలపై దాడి చేసిన విషయంలోను పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనట్లు తెలుస్తోంది.

16 నుంచి బై కాన్‌టెక్ ఎక్స్‌పో



మాట్లాడుతున్న రామకోటయ్య

బీచ్‌రోడ్డు: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ నుంచి మూడు రోజుల పాటు బై కాన్‌టెక్ ఎక్స్‌పో 2023ను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు రామకోటయ్య తెలిపారు. మంగళవారం ఎక్స్‌పో వివరాలను వెల్లడించారు. కరోనా తరువాత నిర్మాణ పనుల్లో నూతన ఆవిష్కరణలు వచ్చాయని, వాటిని కాంట్రాక్టర్స్‌కు పరిచయం చేసేందుకు ఈ ఎక్స్‌పోను ఎంతగానో దోహదపడతుందన్నారు. ఈ ఎక్స్‌పోలో తక్కువ ధరకే యంత్రాలను పొందే అవకాశం ఉంటుందన్నారు. సుమారు 50 సంస్థలు ఈ ఎక్స్‌పోలో పాల్గొంటాయన్నారు. ఎంవీపీలోని గాది రాజు ప్యాలెస్‌లో నిర్వహించే ఈ ఎక్స్‌పోను ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ ఎంవివి సత్యనారాయణ ప్రారంభిస్తారన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ విశాఖపట్నం చైర్మన్ కె.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ సీపీ

దొండపర్తి : బాధితుల సమస్యలను స్వయంగా తెలుసుకొని వాటిని చట్టపరంగా పరిష్కరించేందుకు గురువారం డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆ రోజున ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫిర్యాదుదారులు 0891–2523408 నెంబర్‌కు కాల్ చేసి నేరుగా పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మకు తమ సమస్యలను విన్నవించుకొనే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ప్రతి నెలా 1, 15 తేదీల్లో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీ సూచించారు.

లామినర్ ఎయిర్ ఫ్లో యంత్రం ప్రారంభం


లామినార్ ఎయిర్ ఫ్లో యంత్రాన్ని ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్ అంకాలజీ వార్డులో లామినార్ ఎయిర్ ఫ్లో యంత్రాన్ని మంగళవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ప్రారంభించారు. ఈ పరికరం ద్వారా క్యాన్సర్ రోగులకు మరిన్ని సేవలు అందించడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ, ఆర్ఎం డాక్టర్ అరుణాదేవి, అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్పా, స్టాఫ్ నర్సులు, ఇతర ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దొంగ ఓట్లతోనే వెలగపూడి గెలుపు

ప్రజా ప్రస్థానం పార్టీ అధ్యక్షుడు ముకుంద్


మాట్లాడుతున్న ప్రజా ప్రస్థానం పార్టీ అధ్యక్షుడు ముకుంద్

మహారాణిపేట: విశాఖ తూర్పు నియోజకవర్గంలో 40 వేలకు పైగా బోగస్ ఓట్లు ఉన్నాయని, వీటిని పూర్తిస్థాయిలో తొలగించాలని ప్రజా ప్రస్థానం పార్టీ అధ్యక్షుడు తోట వెంకట సాయి ముకుంద్ డిమాండ్ చేశారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బోగస్ ఓట్లు, రిగ్గింగ్ చేసి గెలుస్తున్నారని.. దొంగ ఓట్లపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టరేట్ వద్ద ఆయన మాట్లాడుతూ స్థానికేతరులు విశాఖ తూర్పులో ఉన్నట్టు ఓట్లు సృష్టించారని ఆరోపించారు. ఈ విషయమై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

కారులో నగదు, బంగారం చోరీ

బీచ్‌రోడ్డు : రామ్‌నగర్‌లోని ఆసుపత్రి ఎదురుగా పార్కింగ్‌లో ఉన్న కారు అద్దాలు పగులగొట్టి అందులోని నగదు, బంగారం చోరీకి గురైంది. పిఠాపురం ఎమ్మెల్యే దొరబాబు బంధువులు రామ్‌నగర్ ఓమ్ని ఆర్కే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కారులో వచ్చిన బంధువులు పార్కింగ్ స్థలంలో కారు పార్కు చేసి లోపలికి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి 9 గంటల సమయంలో కారు అద్దాలు పగులగొట్టి అందులోని రూ.లక్ష నగదు, రెండు బంగారు గాజులను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు మూడో పట్టణ క్రైం పోలీసులు విచారణ జరుపుతున్నారు.

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	515.00
విజయనగరం	519.00
శ్రీకాకుళం	519.00

చికెన్ (కిలో)

రూ.లలో (వందకు)

ఫారం ధర :	రూ.150
బ్రాయిలర్ (లైవ్):	రూ.170
స్కిన్ :	రూ.310
స్కిన్ లెస్ :	రూ.320

విశాఖ బులియన్

24 క్యారెట్స్ (10 గ్రా.)	రూ.60,450
22 క్యారెట్స్ (10 గ్రా.)	రూ.55,400
వెండి (కిలో):	రూ.79.200

ఎస్‌బీఐ వ్యాపారం రూ.57,506 కోట్లు

- ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు
- వివిధ వర్గాలకు సత్వరమే రుణాలు
- విశాఖ ఎస్‌బీఐ డీజీఎం పంకజ్‌కుమార్


మీడియాతో మాట్లాడుతున్న పంకజ్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం: విశాఖ కేంద్రంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం పరిధిలో రూ.57,506 కోట్ల వ్యాపారం జరిగినట్టు ఎస్‌బీఐ డిప్యూటి జనరల్ మేనేజర్ (బిజినెస్ అండ్ ఆపరేషన్స్) పంకజ్‌కుమార్ తెలిపారు. ఇందులో మొత్తం డిపాజిట్లు రూ.32,104 కోట్లు (మార్కెట్ షేర్ 30 శాతం), అడ్వాన్సులు రూ.25,402 కోట్లు (మార్కెట్ షేర్ 25 శాతం) ఉన్నాయన్నారు. డీజీఎంగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం సిరిపురం ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తమ పరిధిలో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, బొబ్బిలి ప్రాంతాల్లో 297 బ్యాంకు శాఖలున్నాయని, 50 లక్షల మంది ఖాతాదారులున్నారని చెప్పారు. గృహ రుణాలు 35 శాతం, ఆటో రుణాలు 28 శాతం, వ్యవసాయ రుణాలు 36 శాతం, ఎస్ఎంఈ విభాగంలో 25 శాతం మార్కెట్ షేర్లతో ఎస్‌బీఐ ముందంజలో ఉందన్నారు. అంతేకాదు వ్యక్తిగత రుణాలు, మార్ట్‌గేజ్ రుణాలు, విద్యా రుణాలు, పంట రుణాలు, తక్కువ వడ్డీకే బంగారు ఆభరణాలపై రుణాలు, డ్వాక్రా రుణాలతో పాటు పీఎం ముద్ర యోజన, పీఎంఈజీపీ, కేవీఐసీ, కేవీఐబీ, పీఎం స్వానిధి, జగనన్న తోడు, టిడ్కో, వంటి ప్రభుత్వ పథకాలను కూడా సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సత్వరమే రుణాలు మంజూరు చేస్తున్నామని వివరించారు. కార్ లోన్లు గంటల వ్యవధిలోనే ఇస్తున్నామన్నారు. డిజిటల్ లావాదేవీల్లోనూ తాము అగ్రస్థానంలో ఉన్నామన్నారు. బ్యాంకు లావాదేవీలు సులభతరం చేసే యూనో యాప్‌ను పెద్ద సంఖ్యలో ఖాతాదార్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని చెప్పారు. ఖాతాదార్లకు మరింత మెరుగైన సేవలందించేందుకు వారి నుంచి ఫీడ్ బ్యాక్‌ను తీసుకునే కార్యక్రమాన్ని కూడా చేపట్టామన్నారు. సైబర్ మోసాల బారిన పడకుండా ఖాతాదార్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ బ్యాంకుల్లో రూ.2 వేల నోట్ల మార్పిడిలో ఖాతాదార్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదని పంకజ్‌కుమార్ తెలిపారు.

పాడి రైతుకు తీపి కబురు

- జిల్లాలో ఐదోసారి పాల సేకరణ ధర పెంచిన అమూల్
- లీటర్‌పై ఆవుపాలకు రూ.1.15, గేదె పాలకు రూ.2.24 పెంపు


పాలు పోస్తున్న మహిళా పాడి రైతులు

సాక్షి, అనకాపల్లి : పాడిరైతులకు అమూల్ మరోసారి తీపి కబురు అందించింది. లీటర్ ఆవు పాలపై రూ.1.15, గేదె పాలపై రూ.2.24 చొప్పున ధర పెంచింది. జగనన్న పాలవెల్లువలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ అమూల్ ఏడు సార్లు ధరలు పెంచింది. జిల్లాలో మాత్రం పాల సేకరణ ప్రారంభం నుంచి ఐదు సార్లు ధరలు పెరిగాయి. ఈ పథకం ప్రారంభంలో గేదె పాల ధర లీటర్ రూ.71.47, ఆవు పాలు రూ.34.20 ఉండేవి. ప్రస్తుతం లీటర్ గేదె పాలు రూ.89.76, ఆవు పాలు రూ.43.61గా ఉన్నాయి. పాల సేకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాలో కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఇందుకు ఎంపీడీవో, తహసీల్దార్ల నేతృత్వంలో మండలస్థాయి కమిటీలను ఏర్పాటుచేయనున్నారు.

డెయిరీలకు మరింత సహకారం

దళారులతో సంబంధం లేకుండా రైతుల ఖాతాల్లో నేరుగా ప్రతీ 15 రోజులకూ నగదు వేయడం జరుగుతోంది. 6 నెలల్లో 90 రోజుల పాటు పాలు పోసిన మహిళా పాడిరైతులతో కోఆపరేటివ్ సొసైటీ కింద మహిళా డెయిరీ సహకార సంఘాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి 88 మహిళా డెయిరీ సహకార సంఘాలను ఏర్పాటు చేశారు. 6 నెలల పాటు పాలు పోసిన ప్రతి పాడి రైతుకు లీటర్‌కు రూ.0.50 చొప్పున రాయల్టీ ఇన్‌సెంటివ్ ప్రతి అక్టోబర్లో చెల్లిస్తున్నారు. పాలను సేకరిస్తున్న ఏఎంసీయూ సెక్రటరీలకు హ్యాండ్లింగ్ చార్జీలు లీటర్‌కి రూ.1 చొప్పున ప్రతీ నెలా సొసైటీ ఖాతాకు జమ చేస్తున్నారు. మహిళా డైరీ సహకార సంఘాల్లో పాలు పోసే రైతులకు ప్రోత్సాహంగా నాణ్యమైన దాణా, డీసీసీబీ ద్వారా 0.58 పైసల వడ్డీకీ రుణాలు, పశువులకు భీమా అందిస్తున్నారు. జగనన్న పాలవెల్లువ ద్వారా జిల్లాలో రోజుకు సగటున 20 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతోంది.

పాడి రైతుల శ్రేయస్సే లక్ష్యంగా..

ప్రభుత్వం చొరవతో అమూల్ ద్వారా పాల సేకరణ చేపట్టడం పాడి రైతులకు బాగా కలిసి వచ్చింది. అమూల్ రాక మునుపు పాల సేకరణ ధరలు పెరగక చాలా ఇబ్బందులకు గురయ్యేవారు. ఇప్పుడు మూడేళ్ల వ్యవధిలో లీటర్ గేదె పాలపై రూ.11, ఆవు పాలపై రూ.10 వరకు పెరిగింది. జిల్లాలో పాడి రైతులు అమూల్‌కి పాలు పోసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరో ఏడాదిలో రెట్టింపు పాలసేకరణ జరగనుంది. ఆర్‌బీకేల ద్వారా కూడా పాల సేకరణ చేపడతాం. జగనన్న పాల వెల్లువ ద్వారా పాడి రైతుల లాభార్జనే ప్రభుత్వ లక్ష్యం.

– డాక్టర్ ప్రసాదరావు, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి